సొంతూళ్లకు పయనం

● సంక్రాంతి సందర్భంగా కిక్కిరిసిపోతున్న కేపీహెచ్‌బీ బస్టాప్ ● ఆర్టీసీలో సీట్లు ఫుల్.. ప్రైవేటులో దందా!



ప్రయాణికులతో కేపీహెచ్‌బీ బస్టాపు



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు పయనం అవుతున్నారు. దీంతో కేపీహెచ్‌బీ ఆర్టీసీ బస్టాపులో మూడు రోజుల నుంచి రద్దీ నెలకొంది. ఏపీలోని రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో సీట్లన్నీ నిండిపోయాయి. ఏ బస్సు ఎప్పుడు వస్తుందో అర్థంకాక బస్సుల కోసం ప్రయాణికులు రోడ్లపైనే ఎదురుచూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ పరిసర ప్రాంతాల నుంచి గ్రామాలకు తరలివెళ్తుండటంతో బస్టాపు రద్దీగా నెలకొంది. ఇదే అదనుగా ఆర్టీసీని ఆసరాగా చేసుకుని అక్కడ టికెట్లు అయిపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్ మూడు, నాలుగు ఇంతలు పెంచి క్యాష్ చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. వినుకొండ, మార్కాపురం వంటి ప్రాంతాలకు రెగ్యులర్‌గా రూ.500కు వెళ్లవచ్చు.. కానీ సంక్రాంతి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రూ.2000 వరకు చార్జీ చేస్తున్నారు. అంటే సొంతూర్లకు వెళ్లేందుకు ఒక్కో కుటుంబంపై ఎంత అదనపు భారం పడుతుందో ఊహించుకోవచ్చు. ప్రైవేట్ ట్రావెల్స్ దందాను అరికట్టే నాథుడే కరవయ్యారని ప్రయాణికులు వాపోతున్నారు.



కేపీహెచ్‌బీలో భోగి మంటలు నేడు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. మలేషియన్‌టౌన్‌షిప్‌లో రెయిన్ ట్రీ పార్క్ ఫెస్టివల్ కమిటీ, రమ్య గ్రౌండ్‌లో శివశక్తి కల్చరల్ అసోసియేషన్, కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లో శ్రీలక్ష్మీ గణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 5 గంటలకు భోగి మంటలు వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసే భోగి మంటల విశిష్టతలను నగర వాసులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడి నివాసితులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు.

గాలి పటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్త : ఎస్‌హెచ్‌ఓ

కేపీహెచ్‌బీకాలనీ: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గాలిపటాలు ఎగురవేయడం సంప్రదాయమే.. కానీ వాటిని ఎగురవేసేటప్పుడు చిన్నారులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సీహెచ్ వెంకన్న సూచించారు. రోడ్లపైన, ఇంట్లోని బాల్కానీ నుంచి రోడ్డుపైకి, ఇంటిపైన, ఇరుకైన సందుల్లో గాలిపటాలు ఎగురవేయకూడదు. ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే గాలిపటాలు ఎగురవేయాలన్నారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలిన గాలిపటాలను తీసే ప్రయత్నం విరమించుకోవాలి. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఆనంద దాయకంగా పడుగ జరుపుకోవాలని సూచించారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

సాహిత్య వారసత్వం కొనసాగాలి: నందిని సిధారెడ్డి

● ముఖచిత్రం, ముందడుగు గ్రంథాల ఆవిష్కరణ

రవీంద్రభారతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడమే తక్కువ అవుతున్న నేటి పరిస్థితుల్లో సాహిత్య వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. అమ్మంగి వేణుగోపాల్, ఆయన కుమార్తె అమ్మంగి కవితాస్వామి రచించిన పుస్తకాలను ఒకే వేదికపై ఆవిష్కరించుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అమ్మంగి వేణుగోపాల్ రచించిన 'ముఖచిత్రం', అమ్మంగి కవితాస్వామి రచించిన 'ముందడుగు' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నందిని సిధారెడ్డి పుస్తకాలను ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహిత్యాన్ని, పుస్తకాలను కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు. తండ్రీ, కూతుళ్ళ పుస్తకాలను ఆవిష్కరించుకోవడం మరిచిపోని విషయమన్నారు. ఇలాంటి వారసత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. ప్రముఖ రచయిత డా.ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ అమ్మంగి వేణుగోపాల్ ప్రేరణతో తనలాంటి వారు ఎంతో మంది కవిత్వం రాశారని గుర్తుచేశారు. ఆయన కుమార్తె కవితాస్వామి కూడా ప్రేరణ పొంది కవిత్వం రాయడం అభినందనీయమని అన్నారు. శిల్పం సమాజానికి కనిపించేలా చేసేవారే కవి అని అన్నారు. తెలంగాణ భాషాభివృద్ధికి అమ్మంగి వేణుగోపాల్ కృషి చాలా ఉందని అన్నారు. జంట పుస్తకాలను ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి.వి.నరసింహస్వామి, పిలక్ష్మీనారాయణ, తిరునగరి దేవకీదేవి, డా.అప్పం పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.మల్లారెడ్డి

పేట్‌బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాల్కాజ్‌గిరి టికెట్‌ను కేటాయించాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మెదక్‌జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. శనివారం కొంపల్లిలోని అశోక మైసాన్‌విల్లాలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలుచేయాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి కష్టపడి పనిచేశానని, మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ తనకే కేటాయించాలని అధిష్ఠానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బక్కా శంకర్‌రెడ్డి, విగ్నేశ్వర్, సులోచన, నటరాజ్‌గౌడ్, శ్యామ్‌రావ్ పాల్గొన్నారు.

ఎక్స్‌టెన్షన్ ఈస్ట్ కాలనీ అసోసియేషన్ ఎన్నిక

పేట్‌బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పద్మానగర్ ఫేజ్-2 ఎక్స్‌టెన్షన్ ఈస్ట్ కాలనీ నూతన అసోసియేషన్ ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షుడిగా నటరాజ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా రాజేంద్రప్రసాద్, పూర్ణయ్య, ఆంజనేయులు, మల్లారెడ్డి, జనరల్ సెక్రెటరీగా రాధాక్రిష్ణమూర్తి, సెక్రెటరీలుగా రవీంద్ర, సంజీవ్‌కుమార్, వెంకట్రావ్, ట్రెజరర్ నర్సింహులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా రవి, యాదగిరి, అంజన్‌కుమార్, అడ్వైజర్‌గా బుచ్చిలింగంను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరికీ గుర్తింపు



నియమాక పత్రం ఇస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీ వైస్‌ప్రసిడెంట్‌గా గడ్డం విజయ్‌చంద్ర, జనరల్ సెక్రెటరీగా దుసకంటి పద్మారావును నియమించారు. శనివారం నియమాక పత్రాన్ని దుండిగల్ మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్ సమక్షంలో కొలన్ హన్మంత్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బస్తీలో శనివారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యం క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రజాపాలనకు కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి సాంబశివరావు, క్రిష్ణగౌడ్, కృష్ణయాదవ్, రహీం, సంగారెడ్డి, మహ్మద్ సాజిద్, రజక, అమినుద్దీన్, మొయినుద్దీన్, సయ్యద్‌బాబా, యూసఫ్, అస్మాయిల్, హమీద్, ఖాజా, సయ్యద్, నదీమ్, మహేష్, సుబ్బు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి బండి రమేష్

అల్లాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్ పరిధిలోని పాండురంగానగర్, మోతీనగర్‌కు చెందిన 30 మంది క్రియాశీలక బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ తరపున మూసాపేట్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేసిన గోపిశెట్టి రాఘవేంద్ర, డివిజన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాండురంగానగర్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఇందర్‌జిత్ సింగ్‌తోపాటు 30 మంది కాంగ్రెస్ కండూవా కప్పుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూము వేణు, తూము సంతోష్, సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్, నర్సింహయాదవ్, సుధాకర్‌రెడ్డి, భిక్షపతి ముదిరాజ్, జె.నర్సింహులు, ఎస్.ప్రతాప్, బాలరంగప్ప, తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి సయద్ మిస్బాఉద్దీన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సచిన్, పల్లపు వేణు, కిరణ్, సాయి, సాత్విక్, నయీమ్, కావేటి నాగార్జున, నజీర్ మోసిన్, కోటిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ మేడ్చల్ జిల్లాకార్యదర్శి వంశీ, సాయి, జాకీర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుండిగల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మల్లంపేట్‌కు చెందిన ముఖేష్(21) ఇంటీరియల్ వర్క్ చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం రోజుమాదిరిగానే పనికి వెళ్లి తిరిగొస్తున్నాడు. మార్గమధ్యంలోని మల్లంపేట్ ఎగ్జిట్ కమాన్ వద్ద ముఖేష్‌బైక్‌పై వస్తుండగా ఎదురుగా అజాగ్రత్తగా వచ్చిన ఏపీ 27టీజెడ్ 2016 నంబర్ గల టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ముఖేష్ రాత్రైన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని సెల్‌ఫోన్‌కు కాల్‌చేయగా గుర్తుతెలియని వ్యక్తి లిఫ్ట్‌చేసి జరిగిన సంఘటనను తెలియజేశాడు. దీంతో కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని దుండిగల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

30న జేఎన్‌టీయూలో సదస్సు

హైదరాబాద్‌సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మెకానికల్ ఇంజనీరింగ్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌పై ఈనెల 30న జేఎన్‌టీయూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో అంతర్జాతీయసదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్‌హుస్సేన్ ఈ నెలాఖరున పదవీవిరమణను పురస్కరించుకొని ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. జాతీయ సదస్సులో పేపర్ సబ్‌మిషన్‌కు ఈ నెల 25లోగా రీసెర్చ్‌స్కాలర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9948496181 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

డీవైఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ ఆధ్వరంలో ముగ్గుల పోటీలు

షాపూర్‌నగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డీవైఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ ఆధ్వరంలో షాపూర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా ముగ్గులను వేశారు. ఈ సందర్భంగా జిల్లా డీవైఎఫ్ఐ మాజీ అధ్యక్షులు కె.లక్ష్మణ్, మహిళా సంఘం మండల కార్యదర్శి ఆర్.స్వాతి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు పసుల అంజయ్యలు మాట్లాడారు. చాలా సంవత్సరాలుగా సంక్రాంతి పండుగకు ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీలు నిర్వహించడమే కాకుండా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, భ్రూణహత్యలపై దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. నాయకులు, నాయకులరాళ్ళు జమునమ్మ కొమరమ్మ, నాగరాజు, జయరాజ్, పాషా, లక్ష్మణ్, కరుణాకర్, స్వాతి, నర్సింహులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేస్తున్న లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు

పేట్‌బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయసహిత 106/2 హిట్, రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ లారీ డ్రైవర్‌లు తలపెట్టిన బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌కు తెలంగాణ రాష్ట్ర లారీడ్రైవర్స్ అసోసియేషన్ ఐడీపీఎల్, చింతల్ సభ్యులు శనివారం జీడిమెట్ల దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పేదవాడి పొట్టకొడుతూ కార్పొరేటర్‌లకు దోచిపెడుతోందని, కేంద్రప్రభుత్వం తీసుకొంటున్న నిర్ణయాలతో పేదల బతుకు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ లారీ డ్రైవర్స్ అసోసియేషన్, బీఆర్‌టీయూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు ఎండి.చాంద్‌బాషా, సయ్యద్, ఆర్.వినోద్‌కుమార్, ఎల్లకుమార్, మునూం సయ్యద్, శివాజీ, గౌస్, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఆనందం.. ఆహ్లాదం

పర్యాటక కేంద్రంగా రాష్ట్రపతి నిలయం



రాష్ట్రపతి నిలయంలో సందర్శకులు

అల్వాల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాష్ట్రపతి నిలయం పర్యాటక ప్రాంతంగా ఆకర్షిస్తోంది. 163 సంవత్సరాల వారసత్వ కట్టడమైన ఈ నిలయాన్ని సాధారణ ప్రజలు సైతం వీక్షించవచ్చునని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన ఆదేశాలతో గత ఏడాది నుంచి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. నిలయంలోని ప్రెసిడెన్షియల్ వింగ్, భోజనశాలతో వంట గదిని డైనింగ్ హాల్‌కు కలిపే భూగర్భ సొరంగ మార్గం, అందులోని చేర్యాల పెయింటింగ్‌లను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. నాలెడ్జ్ గ్యాలరీలతో పాటు రాష్ట్రపతులు ఉపయోగించిన బగ్గీలు, కార్లు చూడటంతో పాటు సెల్ఫీలు తీసుకుంటున్నారు. రాక్‌గార్డెన్, హెర్బల్ గార్డెన్, సీతాకోకచిలుక, నక్షత్రగార్డెన్ వంటి వివిధ తోటలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా నక్షత్రవాటిక

రాష్ట్రపతినిలయంలో నక్షత్రవాటిక ప్రత్యేకఆకర్షణ. ఈ నక్షత్ర వనంలో వివిధరకాల రాశులకు సంబంధించిన మొక్కలను పెంచుతున్నారు. వాటిని చూడటానికి సందర్శకులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. గ్రహాలు, రాశులపై నమ్మకం ఉన్నవారు వనంలోని ఆయా రాశులకు సంబంధించిన మొక్కల వద్ద దోష నివారణ పూజలను చేసుకుంటారు.

ప్రత్యేకతలు..

టేకుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 36 మీటర్ల(120) అడుగుల పొడువైన ఫ్లాగ్‌పోస్ట్, జాతీయ జెండా, అక్కడ రాతిపై దర్శనమిస్తున్న దక్షిణామూర్తి, నంది శిల్పాలు, పైనుంచి జాలువారే నీళ్లు, శతాబ్దం కాలం నాటి రాతి బావి, మూడు మెట్ల బావులు, చిల్డ్రన్ పార్క్.

సందర్శకులతో సంక్రాంతి సంబురాలు

రాష్ట్రపతి పర్యటన మినహా.. ఏడాది పొడవునా రాష్ట్రపతి నిలయం సందర్శకుల కోసం తెరిచి ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడికి వచ్చే సందర్శకులకు పూర్తి స్థాయిలో ఆహ్లాదాన్ని కలిగించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. సంక్రాంతి సంబురాలను సైతం నిలయానికి వచ్చే సందర్శకులతోనే నిర్వహిస్తున్నాం. వీకెండ్‌లో సందర్శకులు పెద్దఎత్తున హాజరవుతున్నారు.

– డాక్టర్ రజనీప్రియ, ఎస్టేట్ మేనేజర్, రాష్ట్రపతి నిలయం

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : ఎమ్మెల్యే



మియాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగినాడు తెల్లవారుజామునే లేచి భోగిమంటలు వేయడం ఆనవాయితీ అని, ఆవుపేడతో తయారైన పిడకలు, మామిడి, రావి, మేడిచెట్ల అవశేషాలు, తాటాకులు లాంటివి భోగిమంటల్లో వేస్తారన్నారు. అదేవిధంగా ఇంట్లోని పాత వస్తువులను కూడా భోగిమంటల్లో వేస్తుంటారని, అంటే పనికిరాని చెత్త ఆలోచనలకు స్వస్తి పలికి, కొత్త మార్గంలోకి పయనించాలని దీని అర్థమన్నారు. అందరూ కలిసిమెలిసి సోదరభావంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కుల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్/కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను శనివారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పంపిణీ చేశారు. మియాపూర్‌కు చెందిన రాజేష్‌కుమార్, కొండాపూర్ అంజయ్యనగర్‌కు చెందిన హుస్సేనమ్మ అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం సీఎం దరఖాస్తు చేసుకోగా వారికి ఒకొక్కరికి రూ.లక్ష చొప్పున మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే వాటికి సంబంధించిన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు పోచమ్మ ఆలయ మైదానంలో భోగి వేడుకలు

ఫతేనగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతిని పురస్కరించుకుని ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ కాలనీ పోచమ్మ ఆలయ మైదానంలో ఆదివారం తెల్లవారు జామున భోగిమంటలను ఏర్పాటు చేసినట్లు భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో భరత్‌నగర్ కాలనీ వాసులంతా పాల్గొని ఐక్యతను చాటాలని ఆయన కోరారు.

కార్పొరేటర్‌ను కలిసిన జింకలవాడ కమిటీ సభ్యులు



కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌ను కలిసిన జింకలవాడ సంక్షేమ సంఘం సభ్యులు

ఫతేనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పరిధికి చెందిన జింకలవాడ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు శనివారం కార్పొరేటర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు రాములు, సీహెచ్ బాలనర్సింహ్మలు, కార్పొరేటర్‌ను శాలువా పూలమాలతో సత్కరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కార్పొరేటర్ అభినందించారు. కార్యక్రమంలో జింకలవాడ సీనియర్ నాయకులు రాజ్‌కుమార్, వెంకటేష్, సురేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌తో ఎన్ఎస్ యూఐ నాయకులు

బాలానగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుకు అర్హత ఉన్న యువతీ యువకులు ఓటర్ జాబితాలో ఈనెల 22లోగా పేర్లను నమోదు చేసుకోవాలని, ఇందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ మిస్బావుద్దీన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపిశెట్టి రాఘవేందర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వంశీముదిరాజ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కర్ణకాంతి సాయి, కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సాయితేజ, నాయకులు కావేటి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాలను అమ్మితే కఠిన చర్యలు

రాయదుర్గం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేయడానికి ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజాని ఉపయోగించవద్దని గచ్చిబౌలి పోలీసులు తెలిపారు. ఇది నాన్-బయోడిగ్రేడబుల్‌కాబట్టి, ఇది పర్యావరణాన్ని, ప్రకృతిని కలుషితం చేస్తుందన్నారు. ఈ మాంజాలను విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో మహిళలు

మియాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చందానగర్ బాలాజీ నిర్మల్ రత్నా అపార్ట్‌మెంట్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పీఏ నగర్‌లో కొమిరిశెట్టి ఫౌండేషన్, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతోపాటు ఐదు ప్రోత్సాహ బహుమతులను నిర్వాహకులు కొమిరిశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ సాయిబాబా, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ రామస్వామియాదవ్ అందజేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, చంద్రకళ, బీమమ్మ, శ్రీదేవి, జిల్ మల్లేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను కుత్బుల్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీకళాశాలను ఏర్పాటుచేయాలని కోరారు. గతంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు నేటికీ పూర్తికాలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొంపెల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి. ప్రశాంత్‌గౌడ్, జిమ్మి దేవేందర్‌లు పాల్గొన్నారు. – పేట్‌బషీరాబాద్, ఆంధ్రజ్యోతి

సీఎం సోదరుడిని కలిసిన కొలన్



సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, జూలకంటి లక్ష్మారెడ్డిలు – నిజాంపేట్, ఆంధ్రజ్యోతి